## పేషెంట్ చెప్పే కథలు

# పారిజాతాలు

### ఆలూరి విజయలక్ష్మి



గాలి అల వేగంగా వచ్చి తాకింది. మంచు బిందువులు జలజల రాలాయి. పారిజాతాల పానుపుమీద మరిన్ని పారిజాతాలు రాలిపడ్డాయి. తెల్లటి రేకలు. ఎర్రటి కాడలు. ఎరుపు తెలుపు కలనేత తివాచీని చెట్టుకింద పరిచినట్లుగా వుంది.

టెర్రెస్‌మీద నుంచుని పక్కింటివారి పెరట్లోని పారిజాతాలవంక తదేకంగా చూస్తోంది విజయ. ఇంద్రధనుస్సులాంటి తన బాల్యం కళ్ళముందు కదిలింది. చీకటి తెరలు విచ్చిపోకుండానే పోటీగా ఒకరి కంటే ఒకరు తామే ముందుగా వెళ్ళి అన్ని పువ్వులూ ఒడిలోకి ఏరుకోవాలని ఆత్రపడేవారు తన మిత్రబృందమంతా. పువ్వులు, నవ్వులు, గిల్లికజ్జాలు, చిలికి చిలికి గాలివానై కొట్లాటలు, అంతలోనే కలిసిపోయి, హత్తుకుపోయి కబుర్లు. పారిజాతాల్ని మాలగాకట్టి తల నిండా పెట్టుకున్నన్ని పెట్టుకుని, మిగిలినవి దేవుడికిచ్చి, పూజారి పెట్టిన కొబ్బరి ముక్కలు నములూ యింటిదారి పట్టడం. ఎక్కడున్నారో ఆనాటి పూలబాలలంతా! పూల పరిమళంలా స్మృతుల సౌరభం చుట్టేసింది

తడిజుట్టును టవల్‌తో తుడుచుకుంటూ తన్మయంగా చూస్తోంది విజయ. పక్కింటివారి అమ్మాయి సుమలత పెరట్లోకి వచ్చి పెద్ద మెట్టతామర ఆకుకోసి, దోనెలా చేసి, అందులో పట్టినన్ని పారిజాతాల్ని తీసుకుంది. ఇంటి గుమ్మానికెదురుగా వున్న తులసికోట చుట్టూ ప్రదక్షిణం చేసి, కళ్ళు అర మోడ్చి, దోసిటితో పువ్వుల్ని చెట్టుమీద జల్లుతూ, మంద్ర స్వరంతో ఏమో చదువుతూంది. సన్నగా, నాజూగ్గా, అందంగా, విరిసిన పారిజాతంలా వుంది సుమలత. ధ్యానం ముగించి మళ్ళీ ఆకునిండా పారిజాతాల్ని ఏరుతూంది మరో గాలితెరవచ్చి ఆమె తల మీద పువ్వుల్ని రాల్చింది. వొత్తుగావున్న ఆమె వెంట్రుకల్లో చిక్కుకున్న పువ్వులు నిశీధి గగనంలో నక్షత్రాల్లా వున్నాయి. పువ్వుల్ని తీసుకుని లేస్తూ విజయ టెర్రెస్ మీది నుంచి చూడడం గమనించి పలకరింపుగా నవ్వి నమస్కారం చేసింది.

మరో గంట తరువాత విజయ కన్సల్టింగ్ రూమ్‌లో అడుగుపెట్టింది సుమలత. పావడాలు తొడుక్కుని, పట్టాల్ని ఘల్లు ఘల్లున మోగిస్తూ కాళ్ళు నేలమీద ఆనకుండా ఛెంగు ఛెంగున గెంతే సుమలత విజయ కళ్ళముందే వింతవింత శోభల్ని సంతరించుకుంటూ, కొత్త కొత్త ఒంపుల్ని దిద్దుకుంటూ ఎదిగి అందాల బొమ్మలా అయింది. కలలుకనే కళ్ళతో, స్వచ్ఛమైన నవ్వుతో, అమాయకమైన చూపుల్తో, లోకమెరుగని పాపాయిలా తిరిగే సుమలతంటే విజయకు ఆప్యాయత, ఆత్మీయత.

"కూర్చోమ్మా!" మౌనంగా కూర్చుంది సుమలత. తలంటి పోసుకుని వదులుగా వేసుకున్న జడలో పారిజాతాల మాల, తలమీద అక్షింతలు. నుదుట తిలకంబొట్టు కింద కనుబొమల మధ్య కుంకుమ. చేతిలో దేవుడి ప్రసాదం, వాడిన పారిజాతాలు, ముఖంలో అలసట, కళ్ళల్లో నీడలు.

"ఏమిటలా వున్నావు? ఒంట్లో బాగా లేదా?" మృదువుగా అడిగింది విజయ.

"గుండెల్లో నొప్పిగా వుంది" చెప్తూ వుండగానే గద్గదమయింది సుమలత కంఠం. కళ్ళెత్తి విజయవంక బేలగా చూసి మళ్ళీ కళ్ళు వాల్చేసింది.

సన్నటి జ్వాల లేస్తూంది విజయ హృదయంలో. పక్కింటి శాస్త్రిగారి నాలుగో సంతానం సుమలత. ఇద్దరి ఆడపిల్లల పెళ్ళిళ్ళు, పురుళ్ళు, పుణ్యాలు అయేసరికి మెడలోతు అప్పుల్లో మునిగిపోయాడు శాస్త్రి. సుమలతకు ముందు కుర్రాడు అస్తుబిస్తు చదువులో అటు ఉద్యోగం దొరక్క, యిటు కాయకష్టం చేయడానికి కులం, వంశం, పరువు ప్రతిష్ఠ అడ్డొచ్చి, ఊరంతా బలాదూరు తిరుగుతున్నాడు. సుమలత తరువాత మరో యిద్దరు అమ్మాయిలు.

సుమలత వ్యక్తురాలవగానే చదువు మానిపించి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. యింట్లో పూట గడిస్తే చాలు బ్రహ్మానందపడిపోతున్న పరిస్థితిలో పెళ్ళి విషయంలో ఎవరూ గొంతెమ్మ కోరికలు కోరుకోవడం లేదు. చూస్తూ చూస్తూ వస్తులతో కాలం వెళ్ళమార్చే సంబంధం చెయ్యలేకపోతున్నారు. రెండు పూటలా కడుపునింపగల స్తోమత వున్నవాడు వేల కట్నాలడుగుతున్నాడు. చివరకు పెళ్ళిచూపులు, ఆశలు పేర్చుకోవడాలు, తిరస్కారింపులు, కుమిలిపోవడాలు మిగుల్తున్నాయి. కొత్తలో తెలిసీ తెలియక సంతోషంగా, ఉత్సాహంగా, [illegible] పెళ్ళిచూపులకు సిద్ధపడే సుమలత ఇప్పుడు వధ్యశిల నెక్కబోయే చిన్నారి మేకపిల్లలా గడగడలాడిపోతూంది.

విజయ దగ్గర యివన్నీ చెప్పుకుని

ఏడ్చింది సుమలత తల్లి కావేరి. విజయ నింకా బాధించిన విషయం ఏడాదిగా వారానికి రెండురోజులు సుమలత దేవాలయం చుట్టూ రోజుకు నూటొక్క ప్రదక్షిణలు చేసి తన పెళ్ళి గురించి దేవుణ్ని ప్రార్థించడం.

అప్పుడప్పుడూ నీరసమో, తల నొప్పో కడుపు నొప్పో అంటూ విజయ దగ్గరకు వస్తుంది సుమలత. అప్పుడా అమ్మాయిని కదిలించింది విజయ.

"రోజంతా ఏం చేస్తావు నువ్వు? ప్రైవేటుగా ఎందుకు చదువుకో కూడదు?"

"మా యింట్లో వొప్పుకోరు. పుస్తకాలు, ఫీజులు.... డబ్బెక్కడిది?" సంకోచంగా ఆగింది.

"పెళ్ళిచూపుల ఫలహారాల ఖర్చుతో చులాగ్గా రెండేళ్ళ చదువయిపోతుంది. ఇంట్లో వాళ్ళ సంగతటుంచు. అసలు నీ బ్రతుకును చక్కదిద్దుకోవాలనే పట్టుదల నీ కుండాలి. పెళ్ళయితేసరే. కాకపోతే?! నీ భవిష్యత్తేమిటి, ఆలోచించుకోవద్దా నువ్వు?!"

"ఏమో! అవన్నీ ఆలోచించాలంటే నాకు భయం" అంతా విని ఈ జవాబిచ్చి భీత హరిణంలా పరుగెత్తింది సుమలత.

తరువాత చాలాసార్లు ఆ అమ్మాయిని చదువుకోమని ప్రోత్సహించింది విజయ. ఆ మాటెత్తగానే ఏదో ఉపద్రవం ముంచుకు రాబోతున్నట్లు పారిపోయేది సుమలత. ఇటీవల ఆ అమ్మాయి సాధించిన కొత్త అభివృద్ధి తరచు గుండె నొప్పి రావడం. ఆ గుండెనొప్పికి కారణం విజయకు తెలుసు. కడుపునిండని తిండి, మెదడుని తొలిచేపే ఆలోచనలు, గుడి చుట్టూ ప్రదక్షిణలు, తనచుట్టూ వున్న ఛాందసత్వాల్ని, మూర్ఖత్వాల్ని ఛేదించుకుని రాలేని పిరికితనం, రవ్వంత సంతోషాన్నీ, సౌఖ్యాన్నీ అనుమతించని పరిస్థితులు, హృదయాన్ని చిత్రవధచేసే ఆశాభంగాలు.... ఏ ఎలక్ట్రో కార్డియోగ్రామ్ సుమలత గుండెనొప్పికి కారణాల్ని తెలపగలుగుతుంది? ఎంత సున్నితమైన స్టెతస్కోప్, ఎంత శక్తివంతమైన ఎక్స్‌రే మెషీన్ సుమలత గుండెలోని అనారోగ్యాన్ని స్పష్టం చేస్తాయి?! "లతా!" ఆప్యాయంగా పిలిచింది విజయ. మెల్లగా కళ్ళెత్తింది సుమలత. యిప్పుడా కళ్ళల్లో భయం, బెదురు లేవు. ఏదో నిశ్చయం, తెగింపు కనపడుతున్నాయి.

"పుస్తకాలు కొనిపెట్టమంటావా?" సుమలత ఎప్పటిలా పారిపోలేదు. ఆమె పెదాల చివర సన్నటి హాసరేఖ మెరిసింది.

●

